# ఇది కల

*** శ్రీ జగం ***

'ఉష' పత్రికలో పని. పదకొండు గంటలకు ఆఫీసు టైము. అయినా ఏదైనా వ్రాసుకోడానికి ప్రొద్దుట కాఫీ త్రాగి ఆఫీసుకు పోవడం అలవాటు. చాల రోజుల్నించి అలానే వస్తూవుండేవాణ్ణి. ఏదో ఓ కథ వ్రాసి తిరిగి యింటికి పోయేవాణ్ణి.

ఆషాఢమాసం వచ్చింది. ఆకాశంలో మేఘాలు నిరాటంకంగా ప్రయాణాలు సాగిస్తూ, ఏ విరహి విరహగాథనో ప్రియురాలికి ఎరిగించి, వాని కన్నీటి ధారలను ఆమె ముందు కురిపించి పోతోన్నట్లు అనిపించింది.

క్రొంగొత్త జంటల హృదయానందాన్ని ఈసారి ఈ అధిక ఆషాఢం వచ్చి మరింత అణగద్రొక్కింది. ఎన్నాళ్లగానో మనస్సుల్లో యువ్విళ్లూరిన యౌవ్వనకేళికి ఈ పాడు ఆషాఢ మాసాలు అంతరాయం కావడం ఎంత ఘోరం? తీరీ తీరని వాంఛలతో ఒకరికొకరు దూరమై, నూతనానుభూతి మూలంగా ఏర్పడిన సుఖసంతోషాలను జ్ఞప్తికి తెచ్చుకుంటూ దురపిల్లే స్థితి ఏర్పడడం చాలా బాధాకరం.

అందుమూలంగానేమో ప్రకృతి అలాంటివి యోగుల హృదయ వేదనలను ఈ మేఘాల దౌత్యంతో కొంత ఉపశమింప జేయ పూనుకుందేమో!

ఆఫీసులో కూర్చుని, కిటికీనుండి ఎదుటి ఆకాశాన్ని చూస్తూ—యిలా ఆలోచిస్తూ—సిగరెట్టు మీద సిగరెట్టు తగలవేస్తూ—మతిని ఉద్రేకపరచ ప్రయత్నించాను. కాని ఆ వుద్రేకానికి మారు అతిగా పొగ పీల్చడంవల్ల తల తిరిగి పోయింది. మైకంతో కళ్లు మూతలుపడి, మనస్సు వికారంతో బాధ పొందింది.

అలాంటి సమయంలో మెదలకుండా కళ్లు మూసుకుని వుండడమే వుత్తమం. కళ్లు సగం మూతలు పడుతూంటే నేను బలవంతంగా పూర్తిగా మూసుకుని, కుర్చీకి జేరగిలబడి కొంచెం విశ్రాంతి తీసుకో ప్రయత్నించాను. నేనెంతో శ్రమపడకుండానే ఎందుచేతనో ఈసారి నిజంగా నిద్ర వచ్చివేసింది...

టీ షాపులో టీ త్రాగి, కిళ్ళీ కొట్టువద్ద కిళ్ళీ వేసుకొని సిగరెట్టు కాలుస్తూ, మెయిన్‌రోడ్డున ఆఫీసుకు పోతూన్నాను. ఆ ప్రక్కకూ—ఈ ప్రక్కకూ మరలుతూన్న నా చూపులు అకస్మాత్తుగా ఫుట్‌పాత్‌కు ఆనుకుంటూ వస్తూన్న ఓ అమ్మాయి మీదకు వాలినై. ముక్కుపొడి రంగుతో మిశ్రమమై బంగారురంగు జీరలతో నున్న కోక. కంటికి తీర్చిదిద్దిన కాటుక, చిట్టి పెదవుల చిందులాడే నవ్వులు, అన్నిటికీ మించిన సొగసు ఆ అమ్మాయి నడక. ఆ ఒయ్యారమైన నడక చట్టున ప్రబంధకారులను జ్ఞప్తికి తెచ్చింది. హంస గమనమని వారు వర్ణించేది యిట్టి నడకనేమో అనిపించింది. ఆమె తీరు చూడగానే, బడిలో పంతులమ్మ పని చేస్తుందని వెల్లడై పోతుంది. పైట చెంగును నడుముకుచుట్టి దోపుకుంది. అందు మూలంగా ఆమె నడుమూ ఆమె సొగసుకు వన్నెగూర్చేదిగానే వుంది. చాలా తక్కువ వయస్సే!

నేను ఆఫీసుకు పోతూన్నాను. ఆ అమ్మాయి బడికి పోతుంది. నేను యింటికి పోతూంటే ఆ అమ్మాయి కూడా యింటికి పోతుంది. దారి ఒకటే. మధ్య దారిలో కలుసుకునే వాళ్లం. నా ఒంక వింతగా చూచేది ఆమె. నేనూ ఆమె ఒంక వింతగా చూచేవాణ్ణి. ఆమె తలవంచుకునేది. నేనూ తలవంచుకునేవాణ్ణి. ఒకరిని ఒకరం దాటిపోయే వాళ్లం.

నా చిన్నతనంలో చదువుకున్న బడి మా ఇంటికి దగ్గర. ఆ బడిలోనే మా వీధిలోనివాళ్లంతా కొంత కొంత వరకైనా చదువుకున్నవాళ్లే. మా మేనమామ కూతురు బడిలోకి వెళ్తుంది. వాళ్ల యిల్లు బడికి మరింత దగ్గర.

ఇంటికి పోతున్నాను నేను. మా అత్త పిలిచింది. బేబీని తీసుకువెళ్లి, బడిలో అప్పజెప్పి, చదువు సరిగ్గా చెప్పమని చెప్పమంది పంతులికి.

బడిదగ్గరకు వెళ్లాను. కిటికీదగ్గర నిలిచాను. లోనకు చూస్తూ పంతులుగారితో ఈ విషయం చెప్పాలనుకున్నాను.

కాని తీరాచూస్తే—ఠీవిగా కుర్చీలో కూర్చుని, చేతిలో బెత్తం ఆడిస్తూ ప్రత్యక్షమైంది పంతులమ్మ. ఇంతకూ ఆ పంతులమ్మ మరొకరుకూడా కాదు. రోజూ దారిలో ఎదురయ్యే ఆ అమ్మాయే. ఆశ్చర్యంతో నిలచిపోయాను.

మా బేబీ పలకమీద 'అ ఆ 'లకు బదులు అందమైన ముగ్గులు ఎలావస్తవో దురూహ్యాం. ఈ విషయమై గోడతో మాట్లాడినట్లు మాట్లాడాను. ఆమే ఆ గోడకు సమాధానం చెప్పినట్లే చెప్పింది: 'సరిగా సమయానికి బడికిరాదు. చదువుచెప్పడం ఎలా ?'

ఈ ప్రశ్నకు జవాబు—'వచ్చిన సమయంలోనైనా అక్షరాలు చెప్పినట్లు కనిపించదు. పలకమీద ముగ్గులు ఎలా వస్తున్నవో !'

వచ్చే నవ్వును ఆపుకుంది. నేను వెళ్లిపోదామనే వుద్దేశ్యంతో—'కొంచెం శ్రద్ధతో సరిగా చెప్పాలి.' అన్నాను.

బేబీనిచూస్తూ—'ఇలా దగ్గరకువచ్చి కూచో !' మధ్య కొంత వ్యవధియిచ్చి—'అలానే చెపుతాను' అంది. మొగం తిప్పుకొని నవ్వుకుంది.

ఇంతకూ ఆ చెప్పడం బేబీకికాదు. నేను దగ్గర కూర్చుంటే నాకు చెప్పతూంది చదువు. నాకూ నవ్వు వచ్చింది. నవ్వుకొని నేను వచ్చివేశాను.

* * *

'ఇదేమిటీ ! నిద్రలో నవ్వుకుంటున్నారు. లేవండి ! లేవండి !! ఆఫీసు ఊడ్చాలి' అంది చీపురుకట్ట చేత బట్టుకొని వూడ్పు మనిషి. త్రుళ్లిపడి లేచాను. కళ్లు నులుముకున్నాను. కలం, కాగితాలు డ్రాయరుమీదనే వున్నయ్. నిద్రమూలంగా వికారం తలత్రిప్పు తగ్గింది. కాని ఈ మధురస్వప్నం యిలా భగ్నమైనందుకు కొంచెం మనస్సు నొచ్చుకున్నా. అది తలపునకు వచ్చి నవ్వుకుండా వుండలేక పోయాను. పక్కున నవ్వాను.

వారెవ్వా! ఎంత మధురం! నాకు చదువు చెప్పతూంది !—నిజంగా అంతకన్నా నాకు కావలసింది ఏముంటుంది ? ఎప్పుడూ నవ్వుతూ—ఎదుట కూర్చుని, ఆ మొగంలోని సౌందర్యాన్ని, ఆ కాటుక కన్నుల కొంటి చూపుల్ని, ఒయ్యారమైన ఆ నడకని, ఆ చిట్టి పెదిమిల మీద ప్రసరించే హాసాన్ని, చూస్తూ చూస్తూ, తీయటి గొంతుతో చెప్పే పాఠాన్ని వల్లిస్తూ ప్రపంచంలోని దుఃఖాల్ని, యింతవరకూ నేను పొందే దుర్భర జీవితయాతనా భారాన్ని విస్మరించి, స్వర్గ సుఖాన్ని పొందకపోయేవాడినా ?

కాని ఏం ఫలం ? ఇది కల ! ఒట్టి కలమాత్రమే. అందులోనూ పగటికల. ఆమాత్రం ఆశ పొందడానికైనా వీలు లేని పగటికల. కనుకనే అసలు అలాంటి పంతులమ్మ అనేదే ప్రపంచంలో పుట్టివుండదేమో ననుకుని మనస్సును వూరట బెట్టాను. కథకు మారు ఈసారి ఈకలను గూర్చే మీకు చెప్పాను. మీరు మరోవిధంగా భావించకండి. ఇది కల ! ఒట్టికల మాత్రమే సుమండీ !—

★

# పరాధీన !

* సూరంపూడి భాస్కరరావు *

పసిగుండె భరముతో బడలిపోయినది !
చిరుగుండె సిగ్గుతో చివికిపోయినది !
వలదోయి మాధవా వలదింత కరుణ !
నిరుపేద గళమునందేల కౌస్తుభము ? ॥పసి॥

యమునా సరిత్తీర రమణీయ తలిని
నిష్కుసుమ కేశనై నిలుచున్న వేళ
మృదుహాస్తముల నెత్తురదుముకొంచీవు
మొగలిరేకులు తెచ్చి ముడిచినయపుడె ॥పసి॥

నిర్ధనను సామి నే నేమీయగలను ?
కరుణింపకయ్యా, నేపరదాసినయ్యా
నిదురించు కోర్కెల కదలించకయ్యా,
మోయలేనయ్యా ఈ మోహ భారమ్ము ॥పసి॥

మొగలిరేకులు తెచ్చి ముడిచినది చాలు !
కౌస్తుభమ్మిపుడేల గళమునవైతు !
ఒడలెల్ల పుల్కలై పడిపోవు నన్ను
పట్టుకొనకుము దేవ పడిపోవనిమ్ము ॥పసి॥

★